# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదం పట్ల భారత్ కఠిన వైఖరి ప్రదర్శిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

- అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

- పరీక్షల నిర్వహణ విధానంలో సమగ్రమైన, పటిష్టమైన చర్యలను చేపట్టాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి NTA ఉన్నతాధికారులను ఆదేశించారు.

- భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ప్రపంచంతో అనుసంధానానికి అవకాశాలు ఏర్పడ్డాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

==============================

ఉగ్రవాదం పట్ల భారత్ జీరో టోలరెన్స్ విధానాన్ని ప్రదర్శిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే ఐఎస్ఐ మద్దతుగల షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నిర్మూలించడం దీనికి ఉదాహరణ అని సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఈరోజు తెలిపారు. 200 మందికి పైగా ఐఎస్ఐ కార్యకర్తలను అరెస్టు చేయడం ద్వారా విధ్వంసక దాడులకు పాల్పడాలన్న వారి ప్రణాళికలను కూడా కేంద్ర ప్రభుత్వం భగ్నం చేసిందని చెప్పారు. 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో సమన్వయంతో కూడిన ఆపరేషన్లను ప్రారంభించడం ద్వారా భద్రతా దళాలు ఈ నెట్‌వర్క్‌ను చిన్నా భిన్నం చేశాయని కేంద్రమంత్రి వెల్లడించారు. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ సంస్థ నుంచి ఐఈడీలు, పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, సజీవ తూటాలు, గూఢచర్యానికి ఉపయోగించే సీసీటీవీ కెమెరాలతో సహా గణనీయమైన పరిమాణంలో వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అమిత్ షా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పుణెను రద్దీ లేని కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు సుమారు 60 వేల కోట్ల రూపాయలతో రహదారి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పూణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో "మౌలిక సదుపాయాల అభివృద్ధి - వికసిత్ భారత్‌కు మార్గం" అనే అంశంపై ఈ రోజు జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ థింకర్స్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుణె-షిరూర్, హడప్సర్-యవత్, తలేగావ్-చకన్-షిక్రాపూర్, షిరూర్-సంభాజీనగర్ వంటి పలు ప్రధాన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత పుణె-సంభాజీనగర్ ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని సుమారు 2 గంటలకు తగ్గించవచ్చునని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల నిర్వహణ విధానంలో సమగ్రమైన, పటిష్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఉన్నతాధికారులను ఆదేశించారు. NTA ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్ జనరల్, ఇతర ఉన్నతాధికారులతో న్యూఢిల్లీలో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... నిర్దేశిత పరీక్షా విధానాలు ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని కోరారు. అలాగే, అత్యంత గోప్యంగా నిర్వహించాల్సిన కార్యకలాపాల వ్యవస్థ, ప్రత్యేక గదుల ఏర్పాటు, ఇంటర్నెట్ సంబంధం లేని వ్యవస్థలు, పరికరాలను భద్రపరిచే విధానాలలో సమూల మార్పులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. పరీక్షా ప్రక్రియలన్నింటిపై సమగ్ర ఆడిట్ నిర్వహించి.. తీసుకున్న చర్యలపైన నివేదిక సమర్పించాలని NTA ని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా అంతర్జాతీయంగా అనుసంధానానికి అవకాశాలు ఏర్పడ్డాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ విమానాశ్రయంలో ఈరోజు నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన దేశంలోనే ఉత్తమమైన విమానాశ్రయంగా భోగాపురం నిలుస్తోందని వెల్లడించారు.

(వాయిస్ 32 సెకన్లు)

ఇదిలా ఉండగా విశాఖపట్నానికి వెళ్లే విమానాలన్నీ ఈరోజు నుండి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుండి నడుస్తున్నాయి. దాంతో ప్రస్తుతం ఉన్న VTZ ఎయిర్ పోర్ట్ కోడ్‌తో భోగాపురం విమానాశ్రయం నుంచి నడుస్తాయని ఎయిర్ ఇండియా ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత యుగంలో పట్టభద్రులవడం అనేది విద్యకు ముగింపు కాదని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. నిరంతరం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇది ఒక పరివర్తన దశగా ఆయన అభివర్ణించారు. తమిళనాడులోని తిరువారూర్‌లో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు (CUTN) 11వ స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా ఈరోజు హాజరై ప్రసంగించారు. 2014 నుండి దేశీయ విద్య, మౌలిక సదుపాయాలలో గణనీయమైన మార్పు జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 16 IIITలు, 8 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 8 IIMలు, 12 కొత్త AIIMS ఆసుపత్రుల ఏర్పాటు జరిగిందని ప్రత్యేకంగా పేర్కొన్నారు. సమాజంలో పేదరికం, అజ్ఞానాన్ని నిర్మూలించడానికి విద్య అత్యంత శక్తివంతమైన సాధనమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి ప్రభుత్వం త్వరలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన రెండు రోజుల ప్రభుత్వ రంగ బ్యాంకుల సదస్సును ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ... కమిటీ తన సిఫార్సులను సమర్పించిన తర్వాత భారతదేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం బ్యాంకింగ్ రంగం పరస్పరం సహకరించుకుంటాయని పేర్కొన్నారు. భారతీయ బ్యాంకులు ప్రస్తుతం బలమైన స్థితిలో ఉన్నాయని.. మొండి బకాయిలు అత్యల్ప స్థాయికి చేరుకున్నాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పింఛను విధానాలను సరళీకరిస్తోందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. జాతీయ అనుభవ్ అవార్డులను 15 మందికి న్యూఢిల్లీలో ఆయన ఈరోజు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పింఛను ఫారాల నుండి అనవసరమైన నిబంధనలను తొలగించి సరళమైన ప్రక్రియలను ప్రవేశపెట్టినట్లుగా తెలిపారు. అదే విధంగా కుటుంబ పింఛను నిబంధనలను కూడా బలోపేతం చేశామని జితేంద్ర సింగ్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకలోని గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 284 పరుగులకే కట్టడి చేసి.. 178 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. భారత బౌలర్లు మానవ్ సుతార్ 4 వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా మూడు వికెట్లు తీశాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 350 వికెట్లు 4 వేల పరుగుల మైలురాయిని చేరుకున్న నాల్గో ఆటగాడిగా జడేజా నిలిచారు. అంతకుముందు భారత్, తొలి ఇన్నింగ్స్ 462 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో భాగంగా న్యూఢిల్లీలో ఈరోజు నుంచి జరుగుతున్న మహిళల సింగిల్స్ ఈవెంట్ లో భారత్ టాప్ షట్లర్ పి.వి. సింధు రెండో రౌండ్ లోకి ప్రవేశించారు. మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన సింధు ఐర్లాండ్ కి చెందిన సోఫియా నోబుల్ పై 21-7, 21-11 తేడాతో ఘన విజయం సాధించారు. మహిళల డబుల్స్ విభాగంలో భారతదేశానికి చెందిన త్రిసా జాలీ గాయత్రి గోపీచంద్ జోడీ రెండో రౌండ్ కు అర్హత సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు రోజులలో బీహార్, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేసింది. అదే విధంగా రేపటి వరకు హర్యానా, చండీఘర్, పంజాబ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ వివరాలను ఐఎండి శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ తెలియచేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 009 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 281 పాయింట్ల నష్టంతో 77 వేల 728 వద్ద ముగిసింది. నిఫ్టీ 78 పాయింట్లు నష్టపోయి 24 వేల 287 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 61 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 394 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

================================

================================